మార్గరెట్, బొమ్మలు: బ్లేర్, తెలుగు: కె. సురేష్

జీవితం, ప్రకృతి అంశాలతో అల్లిన కథలు పిల్లలు, పెద్దలను ఎంతో ఆకట్టుకుంటాయి. "అల" అన్న ఈ కథ అటువంటిదే. దీని మూలం జపాను జానపద కథ.

వయస్సుకీ, దానితో వచ్చే విజ్ఞతకీ ఈ కథలోని వృద్ధుడు ప్రతీక. అతడి మనవడు యువ్వన ఉత్సాహానికి, దానితోపాటు ఉండే విశ్వాసపాత్రత, అపనమ్మకాలు, తొందరపాటుతనాలకు ప్రతీక. కథలోని ప్రకృతి కోపంగా, పట్టువిడుపులు లేకుండా ఉంది. కొండంత అల ఊరినే కబళిద్దాం అని చూసింది. ఉద్వేగభరిత ఘటనలలో ఓజిసాన్ తన వరి పొలాలకు మంట పెట్టటం చూస్తాం – ప్రకృతి వైపరీత్యాలను ప్రకృతి ఫలాలతోనే ఎదుర్కొన్న మానవీయ చిత్రం మనకు కనపడుతుంది.

ఈ జానపద కథ మౌఖికంగా ఒక తరం నుంచి ఇంకో తరానికి అందుతూ వచ్చింది. అందుకే ఈ కథను పైకి చదివి వినిపించటానికి అనువుగా మార్గరెట్ రూపొందించారు.



అల

మార్గరెట్, బొమ్మలు: బ్లేర్, తెలుగు: కె. సురేష్



చాలా రోజుల నాటి సంగతి. జపాన్‌లో ఒక ఊరు సముద్ర తీరానికి చాలా దగ్గరగా ఉంది. సముద్రం ప్రశాంతంగా ఉన్నప్పుడు మెల్లగా ఎగిసిపడే దాని అందమైన అలలలో పిల్లలు ఆడుకునేవాళ్లు. అలలను చూసి పిల్లలు అరిచేవాళ్లు, నవ్వేవాళ్లు. అయితే ఒక్కొక్కసారి తుఫాను వచ్చేది. అలలు కోపంతో విరుచుకుపడి ఊరు మొత్తాన్ని మింగేసేటట్టు ఉండేవి. అప్పుడు అందరూ – పిల్లా పాపా, ముసలీ ముతకా అందరూ వెంటనే ఇళ్లల్లో దాక్కునేవాళ్లు. తలుపుల వేసేసుకుని తుఫాను వెలసి సముద్రం మళ్లీ ప్రశాంతంగా మారేవరకు ఎదురు చూసేవాళ్లు.

ఊరి వెనక ఒక కొండ ఉంది. ఊరి నుంచి కొండపైకి ఒక దారి ఉంది. దారి ఎత్తులకు ఎక్కుతూ, పల్లంవైపుకి దిగుతూ ఉండేది. దారికి రెండువైపులా వరి పొలాలు ఉండేవి. ఈ వరి పొలాలే ప్రజల అసలైన ఆస్తి. తమ పొలాల్లో ప్రజలు ఎంతో కష్టపడి పనిచేసేవాళ్లు. కొండని పచ్చగా మార్చే వానాకాలంలో వాళ్లు తడిసి ముద్దయ్యేవాళ్లు. తీవ్ర ఎండలలో ఎత్తైన ఆ ప్రదేశంలో ప్రజలు కష్టపడి వరి పొలాలను సాకేవాళ్లు. వరి కంకులు తయారయ్యి, బంగారు రంగులోకి మారినప్పుడు అందరూ కలిసి వరి కోతలు కోసేవాళ్లు, పండగ చేసుకునేవాళ్లు. సంవత్సరం పొడవునా తినటానికి వాళ్లకి ఆహారం సమకూరేది.

కిందనున్న ఊరిని, సముద్రాన్ని చూస్తూ జ్ఞాని అయిన ఒక ముసలివాడు కొండమీద ఉండేవాడు. అతని పేరు ఓజిసాన్ – ఓజిసాన్ అంటే జపాను భాషలో తాతగారు అని అర్థం. ఓజిసాన్‌తోపాటు యువకుడైన అతని మనవడు ఉండేవాడు. అతడి పేరు తడ.



ఓజిసాన్ అంటే తడకి ఎంతో ప్రేమ. వయస్సు, విజ్ఞత రీత్యా తాత ఓజిసాన్‌ని అతడు గౌరవించేవాడు. ఊరు మొత్తం ఓజిసాన్‌ని గౌరవించేది. ఓజిసాన్ సలహా తీసుకోవటం కోసమే ప్రజలు ఆ కొండదారిని ఎక్కి వచ్చేవాళ్లు!

గాలి వెచ్చగా, ప్రశాంతంగా ఉన్న ఒక రోజున ఓజిసాన్ మిద్దె గది ముందు నిలబడి తన వరి పొలాలను చూస్తున్నాడు. ఎంతో విలువైన వరి ధాన్యం తయారయ్యి కోతకి సిద్ధంగా ఉంది. తరువాత, కొండ నుంచి కిందకి దిగుతున్న దారికి రెండువైపులా బంగారు మెట్ల లాగా ఉన్న ఊరివాళ్ల వరి పొలాలు కూడా చూశాడు.

కొండ దిగువున ఊరు, ఊరిలోని తొంభై పూరిళ్లు, సముద్ర తీర వంపులోని గుడిని చూశాడు. ఆ సంవత్సరం వరి పంట బాగా పండటంతో ఊరివాళ్లు గుడిలో ఆటపాటలతో సంబరాలు చేసుకుందామని అనుకున్నారు.

తడ వచ్చి తాత పక్కన నిలబడ్డాడు. అతడు కూడా కొండ దిగువకి చూస్తున్నాడు.



వెదురు బొంగులకు వేలాడదీసిన కాగితపు లాంతర్లు చాలా కనపడ్డాయి. ప్రతి ఇంటి మీద పండగ జెండాలు ఎగురుతున్నాయి. గాలి వెచ్చగా, ప్రశాంతంగా ఉండటంతో ఆ జెండాలలో కదలిక లేదు.

"వాతావరణం చూస్తే భూకంపం వచ్చే లాగా ఉంది," ఓజిసాన్ అన్నాడు.

ఆ తరువాత కొంచెం సేపటికే భూకంపం వచ్చింది! అయితే భూకంపం అంత తీవ్రమైనది కాకపోవటం వల్ల తడ భయపడలేదు, అదీ కాకుండా జపానులో చాలా ఎక్కువ భూకంపాలు వస్తాయి. అయితే ఈ భూకంపం కొంచెం తేడాగా ఉంది – దూరంగా, సముద్రపు లోతుల్లోంచి వచ్చినట్లు మెల్లగా, చాలా సేపు భూమి కంపించింది. దాని ప్రభావంతో వాళ్ల ఇల్లు చాలాసార్లు, మెల్లగా కంపించింది. ఆ తరువాత అంతా ప్రశాంతంగా మారిపోయింది.



భూకంపం ఆగిపోయిన తరువాత ఓజిసాన్ నిశితమైన ముసలి కళ్లు సముద్ర తీరాన్ని చూశాయి. ఉన్నట్టుండి నీళ్లు గాఢమైన రంగులోకి మారాయి. సముద్రపు నీళ్లు ఊరి నుంచి దూరంగా వెళుతున్నాయి. సన్నటి పట్టీ లాగా ఉండే సముద్ర తీరం క్రమేపీ పెద్దగా అవుతోంది. *భూమి నుంచి సముద్రం పారిపోతూ ఉంది!*

గుడి దగ్గర, బజారులలో, సముద్ర తీరం దగ్గర ఉన్న మనుషులు ఓజిసాన్‌కి, తడకి చిన్నగా కనపడుతున్నారు. ఇప్పుడు అందరూ సముద్ర తీరం దగ్గరకు చేరుతున్నారు. నీళ్లు వెనక్కి వెళుతుండటంతో అలలు లాగా ఉన్న ఇసక, సముద్రపు నాచుతో కప్పి ఉన్న రాళ్లు బయటపడసాగాయి. దీని అర్థం ఏమిటో ఊరి ప్రజలకి ఎవరికీ అర్థం కాలేదు.



కానీ ఓజిసాన్‌కి తెలుసు. అతడి జీవితకాలంలో ఇంతకు ముందెన్నడూ ఇలా జరగలేదు. కానీ, అతడి చిన్నప్పుడు వాళ్ల తాత చెప్పిన సంగతులు గుర్తున్నాయి. సముద్రం ఇప్పుడు ఏం చేస్తుందో అతడికి తెలుసు. ఊరివాళ్లందరినీ హెచ్చరించాలి.

కొండ దారి గుండా వెళ్లి విషయం చెప్పేటంత సమయం లేదు. తమ పెద్ద గంటని మోగించమని గుడి పూజారులకు చెప్పేటంత సమయం లేదు. తీరికగా ఆలోచించేటంత సమయం లేదు. ఓజిసాన్ ఏదో ఒకటి చెయ్యాలి. అతడు తడతో చెప్పాడు, "ఒక కట్టెపుల్ల మండించి తీసుకునిరా! త్వరగా!"

తాత చెప్పినట్లు తడ చేశాడు. ఇంట్లోకి పరిగెత్తుకుని వెళ్లి ఒక కట్టె పుల్లకు నిప్పు అంటించాడు. వెంటనే దానిని తీసుకునివచ్చి తాతకి ఇచ్చాడు.



వెంటనే ఆ వయోవృద్ధుడు తన వరి పొలాల్లోకి వెళ్లాడు. వరి పంట కోతకి సిద్ధంగా ఉంది. గత సంవత్సరం అంతా కష్టపడితే పండిన విలువైన వరి ఇది, రాబోయే సంవత్సరానికి అంతటికీ అతడికి ఆహారం ఇది.

మండుతున్న కట్టెతో అతడు వరిపైరుకి నిప్పు పెట్టాడు. ఎండిన తాటాకులాగా వరిపైరు చిటపటమంటూ మండసాగింది. నిప్పురవ్వలు జ్వాలలుగా చెలరేగి పొలమంతా వ్యాపించసాగాయి. బంగారు రంగులో ఉన్న వరిపొలం కాలి నల్లగా మారుతోంది. పెద్ద మబ్బు లాగా నల్లటి పొగ ఆకాశంలో కమ్ముకుంది.

తడ ఆశ్చర్యపోయాడు, భయపడ్డాడు కూడా. అతడు తాత వెనకాలే పరిగెత్తుతూ అరుస్తున్నాడు, “ఓజిసాన్ ఏం చేస్తున్నావ్? ఓజిసాన్ ఎందుకు చేస్తున్నావ్? – ఎందుకు?”

కానీ ఓజిసాన్ ఏమీ బదులివ్వలేదు. వివరించటానికి అతడి వద్ద సమయం లేదు. సముద్రం తీరం వద్ద ముప్పులో ఉన్న నాలుగు వందల మంది ప్రాణాల గురించే అతడి ఆలోచన అంతా.

కాలుతున్న వరిపొలంవైపు ఒక్క క్షణం తడ పిచ్చివాడి లాగా చూశాడు. ఆ తరువాత పెద్దపెట్టున ఏడుస్తూ, తాతకి పిచ్చిపట్టిందన్న నమ్మకంతో ఇంట్లోకి పరిగెత్తాడు.

ఓజిసాన్ ఒకటి తరువాత ఒకటి తన వరి మడులను తగలబెడుతున్నాడు. చివరి మడికి నిప్పంటించిన తరువాత కాలుతున్న కట్టెపుల్లను కింద పడేసి, వేచి చూస్తున్నాడు.

కిందున్న ఆలయ పూజారులు కొండమీద మంటను చూసి గుడిలోని పెద్ద గంటను గట్టిగా మోగించసాగారు. ప్రజలు సముద్ర తీరం నుంచి, ఇళ్లలోనుంచి కొండమీదకి చీమల బారుల్లాగా పరుగులు తీయసాగారు.

మండుతున్న వరిపొలాల దగ్గర ఉన్న ఓజిసాన్ పరిగెత్తుకుంటూ వస్తున్న ఊరి ప్రజలను చూస్తూ ఉన్నాడు. ఒక్కొక్క క్షణం అతడికి ఒక యుగంలాగా అనిపిస్తోంది.

"వేగంగా పరిగెత్తండి! వేగంగా పరిగెత్తండి!!" అంటూ అతడు కొండమీద నుంచి అరుస్తున్నాడు. కానీ, దూరంగా ఉన్న ప్రజలకి అతడి అరుపులు వినపడటం లేదు.

సూర్యుడు అస్తమిస్తూ ఉన్నాడు. ముడతలు పడినట్టు ఉన్న సముద్ర తీరం, దాని వెనక పెద్ద అగాధం కనపడుతున్నాయి, అయినా సముద్రం క్షితిజంవైపుకి వేగంగా ఇంకా పరిగెత్తుతూనే ఉంది.

కొంచెం సేపటికి మంటలను ఆర్పటానికి మొదటి గుంపు అక్కడికి రానే వచ్చింది. కానీ ఓజిసాన్ రెండు చేతులూ జోడించి వాళ్లను అడ్డుకున్నాడు.

"మంటలను ఆర్పవద్దు!" ఓజిసాన్ చెప్పాడు. "పొలాలను తగలబడనివ్వండి! ఊరిలో ఉన్న ప్రతి ఒక్కరూ ఇక్కడికి రావాలి. కింద పెద్ద ప్రమాదం పొంచి ఉంది!"

ఊరివాళ్లందరూ అక్కడికి వచ్చారు – వేగంగా పరిగెత్తగలిగే యువకులు, పిల్లలు, ఆడవాళ్లు ముందు వచ్చారు. ఆ తరువాత వయసు మళ్లిన ఆడవాళ్లు, మగవాళ్లు వచ్చారు. అందరికంటే చివరగా పిల్లల్ని ఎత్తుకుని ఉన్న మహిళలు వచ్చారు. బక్కెట్లతో నీళ్లు అందించవచ్చని చిన్న పిల్లలు కూడా వచ్చారు. బాగా ముసలివాళ్లు కూడా కొండపైకి చేరుకుంటున్నారు. అయితే ఆపాటికే ఓజిసాన్ పొలాలన్నీ కాలి, బూడిద అయిపోయాయి. ఓజిసాన్ వైపు అందరూ విషణ్ణ, ఆశ్చర్యదృక్కులతో చూడసాగారు. అప్పుడు సూర్యాస్తమయం అయ్యింది.

పరిగెత్తుకుంటూ ఇంటిలోనుంచి తడ బయటకు వచ్చాడు. “తాతయ్యకు పిచ్చిపట్టింది!” అతడు ఏడుస్తూ చెప్పాడు. “అతడికి మతి చలించింది. కావాలని అతడు వరి పొలాలకు నిప్పు పెట్టాడు. నేను నా కళ్లతో చూశాను!”

“పిల్లవాడు చెప్పింది నిజమే. నా పొలాలకు నేనే నిప్పు పెట్టాను,” ఓజిసాన్ చెప్పాడు “...ఊరి ప్రజలందరూ ఇక్కడికి వచ్చారా?”

మగవాళ్లకి కోపం వచ్చింది. “ఆఁ, అందరూ వచ్చారు,” అని వాళ్లు బదులిచ్చారు. “ఈ ముసలివాడికి పిచ్చిపట్టింది. ఇప్పుడు అతడు మన పొలాలను కూడా తగలబెడతాడు,” అంటూ వాళ్లు తమలోతాము గొణుక్కున్నారు. వాళ్లు తమ పిడికిళ్లను ఝుళిపిస్తూ అతడిని బెదిరించసాగారు.

సముద్రం వైపు చెయ్యి చాపి, “చూడండి!” అని ఓజిసాన్ అన్నాడు.

మసక కాంతిలో తూర్పువైపుకి చూసిన ప్రజలకు సంధ్యా సమయపు దిగంతం వద్ద, అంతకు ముందు తీరం లేని చోట తీరం నీడ లాగా పొడవాటి గీత కనపడింది. ఆ గీత మెల్లగా వెడల్పుగా, నల్లగా మారసాగింది. అది వాళ్లవైపుకి వస్తోంది. ఆ నల్లటి రేఖ తిరిగి వస్తున్న సముద్రం, దాని అలలు కొండంత ఉన్నాయి, డేగ కంటే వేగంగా అవి భూమి వైపు దూసుకుని వస్తున్నాయి.



“తుఫాను అల!” అంటూ ప్రజలు పెద్దపెట్టున అరిచారు. పిడుగుపాటు కంటే పెద్ద శబ్దంతో తీరాన్ని అలలు తాకటంతో అన్ని అరుపులు, కేకలు మూగబోయాయి. ఆ అలల తాకిడికి కొండలు కంపించాయి.

ఆ తరువాత మెరుపు లాగా సముద్రపు నురగ మింటికి ఎగిసింది. కొండపైకి దూసుకుని వస్తున్న నీటి తుంపర తప్పించి కొద్ది క్షణాలు ఇంకా ఏమీ కనపడలేదు. ప్రజలు భయంతో అటు, ఇటు పరుగులు పెట్టసాగారు.



ప్రజలు మళ్లీ కిందివైపుకి చూసేసరికి వాళ్ల ఇళ్లు ఉన్న ప్రదేశంలో ఇప్పుడు సముద్రం తాండవం చేస్తోంది. సముద్రం గర్జిస్తూ తనతోపాటు నేలను కోసేస్తూ వెనక్కి వెళ్లింది. రెండుసార్లు, మూడుసార్లు, అయిదుసార్లు సముద్రం ఊరు మీదకి ఉప్పొంగి, వెనక్కి తగ్గింది. అయితే ప్రతిసారీ దాని తీవ్రత తగ్గుతోంది. చివరికి అది తన పాత తీర రేఖ వద్ద ఆగింది, అయితే తుఫాను తరువాత అది ఇంకా గుడగుడమంటూనే ఉంది.

ఓజిసాన్ ఇంటి దగ్గర ఎవ్వరూ ఒక్క మాట మాట్లాడలేదు. వాళ్లు కిందవైపుకి చూస్తూ ఉండిపోయారు.



సముద్రపు తాకిడికి ముక్కలైన బండరాళ్లు వాళ్లకి కనిపించాయి, ఇళ్లు, గుడి ఉన్న చోట శిధిలాలు, ఇసక మేటవేసిన భూములు వాళ్లకి కనిపించాయి.

అక్కడ విరిగిన వెదురు బొంగులు, తీరంవెంట పరుచుకున్న ఇంటి కప్పుల గడ్డి తప్పించి ఊరు లేదు. అప్పుడు, “అందుకే వరిపొలాలకు నిప్పు అంటించాను,” అని మెల్లగా అంటున్న ఓజిసాన్ మాటలు ప్రజలకు వినిపించాయి.



సమస్త సంపద కోల్పోయి అత్యంత పేదవాడిగా విజ్ఞుడైన తమ వృద్ధ స్నేహితుడు అక్కడ నిలబడి ఉన్నాడు. అయితే అతడు నాలుగు వందల మంది ప్రాణాలు కాపాడాడు.

తడ పరిగెత్తుకుంటూ వచ్చి అతడి చేతిని గట్టిగా పట్టుకున్నాడు. ప్రతి కుటుంబ పెద్ద అతడిముందు మోకరిల్లారు, ఆ తరువాత అందరూ అలాగే చేశారు.

"నా ఇల్లు ఇంకా నిలబడే ఉంది," వృద్ధుడైన ఓజిసాన్ చెప్పాడు. "చాలామంది ఈ రాత్రికి ఇక్కడ తలదాచుకోవచ్చు," అంటూ అతడు తన ఇంటివైపు నడిచాడు.



మంచి రోజులు మళ్లీ వచ్చినప్పుడు ఓజిసాన్‌కి తాము రుణపడి ఉన్నామన్న సంగతి ప్రజలు మరిచిపోలేదు. అతడిని తిరిగి ధనవంతుడిని చెయ్యలేకపోయారు. కాని, ఊరిని మళ్లీ కట్టుకునేటప్పుడు అతడిని గౌరవించటానికి ఒక గుడి కట్టారు.

అతడి కోసం కట్టిన గుడి ఇప్పటికీ ఉందని చెబుతారు. ప్రజల ప్రాణాలను కాపాడటానికి తన వరిపొలాలను తగలబెట్టిన ఓజిసాన్‌ని ఈనాటికీ గౌరవిస్తారు.